www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 24 ఆగస్టు 2023

5

పశ్చిమ గోదావరి



'పెనుమంట్ర'లో వర్షం

ప్రజాశక్తి - పెనుమంట్ర



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

అల్పపీడన ప్రభావంతో మండలంలో బుధవారం వర్షం పడింది. ఈ వర్షాలకు పొలమూరు నుంచి నౌడూరు సెంటర్‌కు వెళ్లే రహదారి చెరువును తలపిస్తోంది. వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే పొలమూరు నుండి మాముడూరు, బ్రాహ్మణచెరువు సెంటర్‌కు వెళ్లే ఆర్ అండ్ బి రహదారి ఛిద్రంగా తయారైంది.

పరిహారం ఇస్తేనే 'పోలవరం' పూర్తి

నిర్వాసితుల సమస్యే అత్యంత ప్రధానం

ప్రాణాలు అరచేత పట్టుకుని నిర్వాసితులు జీవనం

ప్రశ్నార్థకంగా డ్యామ్ భద్రత

పోలవరంలో మొదటి ముద్దాయి మోడీ ప్రభుత్వమే

సిపిఐ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరుప్రతినిధి, అర్బన్

పోలవరం ప్రాజెక్టులో సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించినప్పుడే ప్రాజెక్టు పూర్తయినట్లని, నిర్వాసితులకు పరిహారం అందించకుండా గోదావరిలో ముంచేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడం దారుణమని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు తెలిపారు. 'రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి' అనే నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చేపట్టిన బస్సుయాత్ర బుధవారం ఏలూరు చేరుకుంది. స్థానిక ఆశ్రం ఆసుపత్రి వద్ద బస్సుయాత్రకు ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక టుబాకో మర్చంట్స్ కళ్యాణ మండపంలో పోలవరం నిర్వాసితుల సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, టిడిపి నేత, పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, సామాజిక విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ, ప్రత్యేకహోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. సమావేశానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అధ్యక్షత వహించారు. తొలుత సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య నేతలను వేదికపైకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు ఇప్పటి వరకూ 22 శాతం మాత్రమే పరిహారం అందించారన్నారు. డ్యామ్ మాత్రం 70 శాతం పూర్తి చేశారన్నారు. సిఎం జగన్ కేంద్రంపై ఒత్తిడి చేసి నిధులు రాబట్టకుండా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రాజెక్టు డ్యామ్ భద్రత ప్రమాదంలో పడిందని, ప్రపంచస్థాయి నిపుణులతో తనిఖీ చేయించి నష్టపరిహారాన్ని కాంట్రాక్టర్ల వద్ద వసూలు చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వీర్యంలో తొలిముద్దాయి మోడీ ప్రభుత్వమే అని విమర్శించారు. మోడీ అరచేతిలో వైకుంఠం చూపిస్తూ పనికిమాలిన ప్రధానిగా ఉన్నందుకు ప్రతి భారతీయుడూ సిగ్గుపడాలన్నారు. జగన్‌ను మోడీ కాపాడుతున్నారని, ఆ ధైర్యంతోనే ఇక్కడ వైసిపి నాయకులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధుల కోసం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలన్నారు. నిర్వాసితులకు అండగా ఉండి అందరం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాజన్న రాజ్యం తెస్తానని మోడీ రాజ్యం తీసుకొచ్చిన ఘనుడు జగన్ అని ఎద్దేవా చేశారు. 41.15, 45.75 లెక్కలు ప్రాజెక్టు ఎత్తుకు సంబంధించినవే కాదని, నిర్వాసితుల పరిహారానికి సంబంధించినవని తెలిపారు. ప్రస్తుతం ముంచుతున్నవి గోదావరి వరదలు కాదని, ప్రాజెక్టు నిర్మాణంతో వస్తున్న వరదలేనని అన్నారు. నిర్వాసితుల భూములకు ఇస్తామన్న రూ.ఐదు లక్షల పరిహారంలో ఐదుపైసలుగాని, పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షల్లో పదిపైసలుగాని జగన్ ఇవ్వలేదన్నారు. వరదలొస్తే రూ.పది వేలు పరిహారం ఇవ్వకుండా రూ.రెండు వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలు నిర్వాసితులకు అండగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మోడీని నిధులు అడగడానికి భయపడుతుందన్నారు. కేంద్రం చెబుతున్న విద్యుత్, చెత్త వంటి అన్ని పన్నులు వేస్తున్నారన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు ఇచ్చే ఉచిత విద్యుత్ కూడా ఇవ్వడం లేదన్నారు. ఇదేనా అభివృద్ధి అని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసి నిర్వాసితులను గోదావరిలో ముంచారన్నారు. నిర్వాసితుల త్యాగఫలితమే పోలవరం ప్రాజెక్టు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం రూ.15 వేల కోట్లు కేటాయిస్తే నాలుగేళ్లలో నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించడంతోపాటు, ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యి రాష్ట్రం సస్యశ్యామలమయ్యేదన్నారు. పోలవరం నిర్వాసితులు లక్షా ఆరు వేల కుటుంబాలుంటే కేవలం 20 వేల కుటుంబాలకు మాత్రమే నష్టపరిహారం చెల్లిస్తామనడం దుర్మార్గమన్నారు. అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేయకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తూ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతికి జగన్, పోలవరం ప్రాజెక్టుకు మోడీ శనిలా దాపురించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం వరదలు వచ్చినప్పుడల్లా గిరిజనులు కొండలు, గుట్టలపై తల దాచుకుని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి, ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుతో భవిష్యత్తులో కరువురహిత రాష్ట్రంగా ఎపి ఉంటుందన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో పోలవరం ప్రాజెక్టు పనులు 72 శాతం పూర్తి చేస్తే వైసిపి ప్రభుత్వం కేవలం నాలుగు శాతం మాత్రమే పూర్తి చేసిందన్నారు. కనీసం 2030 నాటికి పూర్తవుతుందో లేదోనని రైతాంగం, ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఎప్పటి పనులు అప్పుడు పూర్తి చేయకుండా కాంట్రాక్టు ఏజెన్సీలను ఒక కలం పోటుతో రద్దు చేయడం పోలవరం జాప్యానికి ప్రధాన కారణమన్నారు. సామాజిక విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రాజెక్టు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. నీటికి రాజకీయరంగు పులమాల్సిన అవసరం లేదన్నారు. నీటితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తే అన్ని రంగాలకూ ఉపయోగమని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సర్వం త్యాగం చేసిన నిర్వాసితులే తొలి లబ్ధిదారులుగా ఉండాలన్నారు. మోడీ ప్రభుత్వానికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంలో చిత్తశుద్ధి లేదని విమర్శించారు. జగన్ అనాలోచిత విధానాల ఫలితంగా మట్టి రాతి కట్టడం, డ్యామ్ నిర్మాణం ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. రివర్స్ టెండరింగ్ పేరుతో కాంట్రాక్టర్‌ను మార్చి రూ.235 కోట్లు ఆదా చేశానన్న సిఎం జగన్ రూ.2335 కోట్లు అదనంగా ప్రతిపాదించి కాంట్రాక్టర్‌ను నియమించి రాష్ట్ర ఖజానాకు తూట్లు పొడిచారన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదిత డిజైన్ 45.72 నుండి 41.15 కుదించి నిర్మించడం సరికాదన్నారు. రాజకీయ నాయకులు ఐక్యంగా పోరాడితేనే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ నిర్వాసితులను పూర్తిస్థాయిలో ఎప్పుడు ఖాళీ చేయిస్తే అప్పటివరకూ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని పరిహారం చెల్లించాలన్నారు. బిజెపితో అంటకాగే పార్టీలన్నింటిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఏలూరు జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం పోరాడుతున్న అన్ని పార్టీలకూ తమ మద్దతు ఉంటుందన్నారు. జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించడానికి ముఖ్యమంత్రి జగన్ కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ప్రజా సమస్యలపై నిలదీయలేని ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం మన దౌర్భాగ్యమన్నారు. వైసిపి, బిజెపి మినహా అన్నిపార్టీల నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ వందన సమర్పణ చేశారు. తొలుత ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్, రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.పెంచలయ్య, ఏలూరు ఏరియా కార్యదర్శి తమ్మా విశ్వేశ్వరరావు ఇతర కళాకారులు ఆలపించిన గేయాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకుడు డిఎన్‌విడి ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్, జెసి

టంగుటూరి స్ఫూర్తి ఆదర్శనీయం

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తి అందరికీ ఆదర్శం కావాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డితో కలిసి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయన పేరును ఒక జిల్లాకు పెట్టారని తెలిపారు. 1940-50వ దశకంలో ఆంధ్రా రాజకీయాల్లో ఆయన పాత్ర కీలకమైందని తెలిపారు. నిరుపేద కుటుంబంలో పుట్టి, ధనికుల ఇళ్లల్లో వారాలు చేసుకొని కష్టపడి చదువుకుని ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి కావడం గొప్ప విషయమన్నారు. జెసి మాట్లాడుతూ ప్రకాశం పంతులు త్యాగ నిరతి, ఆశయాలు, వ్యక్తిత్వం ద్వారా స్ఫూర్తి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కె.కృష్ణవేణి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జివిఆర్‌కెఎస్ఎస్.గణపతిరావు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలోకి లోకేష్ పాదయాత్ర

- నూజివీడు మండలం మీర్జాపురంలో ప్రవేశం
- మూడు రోజులు నూజివీడు నియోజకవర్గంలోనే యాత్ర

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఏలూరు జిల్లా నూజివీడు మండలం మీర్జాపురం గ్రామంలోకి గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రవేశించనుంది. లోకేష్ పర్యటనకు సంబంధించి షెడ్యూల్‌ను ఆ పార్టీ నాయకులు విడుదల చేశారు. 24వ తేదీ గురువారం సాయంత్రం మీర్జాపురం గ్రామానికి చేరుకుని అక్కడి నుంచి గ్రామ శివార్లలో ఎంఎన్‌కె రహదారి పక్కన రాత్రి బస చేయనున్నారు. 25వ తేదీ శుక్రవారం ఉదయం సమీపంలోని పామాయిల్ తోటలో మామిడి రైతులతో సమావేశం జరగనుంది. అనంతరం గొల్లపల్లి నుంచి పాదయాత్ర ప్రారంభమై మోర్సపూడి, తక్కెలూరు గ్రామాల మీదుగా సాగనుంది. మధ్యాహ్నం భోజనం నూజివీడు సరస్వతీదేవి ఆలయ సమీపంలో ఏర్పాటు చేశారు. అనంతరం నూజివీడు పట్టణంలో చిన్న గాంధీబొమ్మ సెంటర్, పొట్టి శ్రీరాములు బొమ్మసెంటర్, పెద్దగాంధీ బొమ్మసెంటర్, పోస్టాఫీస్ రోడ్డు, టిటిడి కల్యాణ మండపం మీదుగా ఎంప్లాయిస్ కాలనీ నుంచి మూడుపల్లి తాతయ్య బాబు జూనియర్ కాలేజీ, వెంచర్, బైపాస్‌రోడ్డు మీదుగా పోతిరెడ్డిపల్లి గ్రామం వరకూ సాగి రాత్రికి అక్కడ బస చేయనున్నారు. 26వ తేదీ శనివారం ఉదయం పోతిరెడ్డిపల్లి గ్రామం నుంచి సింహాద్రిపురం, ముసునూరు మీదుగా వలసపల్లి గ్రామం వరకూ సాగనుంది. మధ్యాహ్న భోజన విరామం అనంతరం వలసపల్లి నుంచి యాత్ర ప్రారంభం కానుంది. లోకేష్ పాదయాత్రకు సంబంధించి టిడిపి నాయకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. నూజివీడు నియోజకవర్గ అనంతరం చింతలపూడి నియోజకవర్గంలోకి లోకేష్ పాదయాత్ర ప్రవేశించనుంది. చింతలపూడిలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన షెడ్యూల్ వివరాలు రావాల్సి ఉంది.

చంద్రయాన్ - 3 విజయవంతం

జాతీయ పతాకాలతో ఎస్ఆర్‌కెఆర్, శ్రీసూర్య విద్యార్థుల ర్యాలీలు, సంబరాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చంద్రయాన్ ప్రయోగం విజయవంతమైన సందర్భంగా భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు బుధవారం సాయంత్రం పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రాంగణం నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకూ వెళ్లి అక్కడ నుంచి తిరిగి కళాశాలకు వచ్చి ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కస్పాండెంట్ ఎస్ఆర్‌కె.నిషాంత వర్మ, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు, డిఎస్‌టి పూర్వపు శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్ రాజు మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో భారతదేశం అగ్రగామిగా నిలిచిందన్నారు. తమ కళాశాల అడ్వయిజరీ కౌన్సిల్ మెంబర్‌గా ఉన్న డాక్టర్ వైవి.కృష్ణమూర్తి కూడా ఇందులో భాగస్వామ్యం కావడం తమ కళాశాలకే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల కెమిస్ట్రీ హెడ్ పి.భవాని, టెక్నాలజీ సెంటర్ హెడ్ ఎం.గోపాలకృష్ణమూర్తి, పిఎ.రామకృష్ణంరాజు, ఫిజికల్ డైరెక్టర్ సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : చంద్రయాన్ - 3 విజయవంతమైన నేపథ్యంలో శ్రీ సూర్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు బుధవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సూర్య విద్యాసంస్థల అకడమిక్ అడ్వయిజర్ కె.జానకీరామ్ మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో భారత్ నిలిచిందన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష రంగంలో ఇస్రో మరెన్నో విజయాలు సాధించాలన్నారు. ఫిజిక్స్ ప్రొఫెసర్ మహ్మద్ ఫాజిల్ మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో తక్కువ ఖర్చుతో ఎన్నో ప్రయోగాలను భారతదేశం నిర్వహిస్తోందని తెలిపారు. ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఎనలేనిదన్నారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండంట్ ఘంటసాల బ్రహ్మాజీ, ఉపాధ్యాయులు డి.శ్రీకళ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎఆర్‌కెఆర్ విద్యార్థులు, సిబ్బంది

వీరవాసరం : చంద్రయాన్-3 విజయవంతం కావడంతో విద్యార్థుల సంబరాలు అంబరాన్నంటాయి. వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద చంద్రయాన్-3 ప్రత్యక్ష ప్రసారాన్ని స్కూల్ యాజమాన్యం బుధవారం విద్యార్థులు తిలకించే ఏర్పాటు చేశారు. చంద్రుడు ఉపరితలంపై ల్యాండర్ విక్రమ్ క్షేమంగా దిగిందంటూ ప్రయోగం విజయవంతమైనట్టు ఇస్రో శాస్త్రవేత్తలు ప్రకటించడంతో విద్యార్థులు ఒక్క సారిగా కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా శాస్త్ర సాంకేతిక విషయాలపై విద్యార్థులకు చంద్రయాన్-3ను భారత్ శాస్త్రవేత్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం వంటి విషయాలపై అవగాహన కలిగించినట్టు ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్, స్కూల్ కమిటీ ఛైర్మన్ చుండూరి ముసలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : చినతాడేపల్లి శ్రీచైతన్య విద్యార్థులు చంద్రయాన్-3 పరిశోధన అద్భుతమైన ఫలితాలు అందించాయని, ఇప్పటివరకూ చంద్రుడి దక్షిణ ధ్రువంపై మొట్టమొదటిసారిగా ఉపగ్రహం అడుగుపెట్టడం ఇదే తొలిసారి కావడం మన దేశానికి గర్వకారణం అని పాఠశాల హెచ్‌ఎం దాసరి ప్రసాద్ తెలిపారు. శ్రీచైతన్య విద్యార్థులు డిజిటల్ థియేటర్లో చంద్రయాన్ ప్రయాణాన్ని తిలకించి ఆనందించి శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రసాద్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు మురళీ మాట్లాడారు.

పాలకొల్లు : చంద్రయాన్-3 జాబిల్లిలో సేఫ్‌గా లాండింగ్ అయినందుకు పట్టణంలో బుధవారం సాయంత్రం వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో విజయోత్సవం నిర్వహించారు. గాంధీ బొమ్మ సెంటర్ వద్ద బిజెపి నేతలు, యునైటెడ్ కాపు క్లబ్ సభ్యులు బాణాసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు.

భీమవరం రూరల్: ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు ఎంతో ఆత్రుతతో ఎదురు చూసిన చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం కావడంపై ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం రాత్రి ఆయన మాట్లాడారు. ఇంతటి సంతోషంతో ఒళ్లు పులకరిస్తోందని తెలిపారు.

పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్

పకడ్బందీగా చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఓటర్ల జాబితాల వారీగా పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ జిల్లాలోని ఎలక్ట్రోరల్ రోల్ అధికారులు, సహాయ ఎలక్ట్రోరల్ రోల్ అధికారులతో పోలీస్‌స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియపై ఒక రోజు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాల వారీగా పోలింగ్ స్టేషన్ల రేషన్‌లైజేషన్ ప్రక్రియ పొరపాట్లకు తావులేని విధంగా నిర్వహించాలన్నారు. ఒక కుటుంబంలో ఉన్న సభ్యులు ఎట్టి పరిస్థితుల్లో ఒకే పోలింగ్ స్టేషన్లో ఓటు వేసేలా ఉండాలన్నారు. అలాగే ఒక అపార్ట్మెంట్లో, ఒక వీధిలో ఉన్న ఓటర్లను కూడా ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. ఓటర్ల వెసులుబాటును దృష్టిలో ఉంచుకొని రెండు కిలోమీటర్ల పరిధి దాటకుండా పోలింగ్ స్టేషన్ ఏర్పాటు ఉండాలన్నారు. ఒక పోలింగ్ స్టేషన్ పరిధిలో కనీసం 300 ఓటర్లు, అత్యధికంగా 1500 ఓటర్ల మించి ఉండకూడదన్నారు. ఓటర్ల సంఖ్య పెరిగితే అదనపు పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. లంక గ్రామాల ప్రజలు నది దాటి వచ్చే పరిస్థితి లేకుండా అక్కడే పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సదస్సులో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, ఆర్‌డిఒ దాసి రాజు, కలెక్టరేట్ ఎఒ అప్పారావు, ఏడు నియోజకవర్గాల ఇఆర్‌ఒలు పాల్గొన్నారు.

సైబర్ నేరాల అదుపునకు కార్యాచరణ : ఎస్‌పి

ప్రజాశక్తి - మొగల్తూరు



మొగల్తూరు స్టేషన్లో పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌పి

సైబర్ నేరాలను అదుపు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని ఎస్‌పి యు.రవిప్రకాష్ తెలిపారు. మొగల్తూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన బుధవారం సాయంత్రం సందర్శించారు. స్టేషన్లో రికార్డులను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిజిపి పర్యవేక్షణలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ ముగ్గురికి దీనిపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. బ్యాంకు ఖాతాల్లో నగదు కోల్పోయిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు సమాచారం అందిస్తే నగదు పడిన ఖాతాలను స్తంభింపజేసే నగదు రికవరీ చేస్తామన్నారు. పేరుపాలెంబీచ్‌లో పర్యాటకులకు అక్కడ ప్రమాదాలు తెలిసేలా స్టిక్కర్లు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామన్నారు. దొంగతనాలకు సంబంధించి చోరీకి గురైన సొత్తును 60 శాతం రాబట్టి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచామన్నారు. ఆయన వెంట డిఎస్‌పి.రవి, మనోహరాచారి, ఎస్ఐ వీరబాబు, సిబ్బంది ఉన్నారు.

డిఎన్ఆర్ కాలేజీ ప్రయివేటీకరణ మానుకోవాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్

ప్రజాశక్తి - భీమవరం

డిఎన్ఆర్ కాలేజీ ప్రయివేటీకరణ మానుకోవాలని, లేని పక్షంలో పోరాడి కళాశాలను కాపాడుకుంటామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ అన్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసన్నకుమార్ మాట్లాడారు. స్వాతంత్ర పోరాట వీరులు, మేధావులు 1945 జులై 4వ తేదీన ఈ కాలేజీని ఏర్పాటు చేశారని తెలిపారు. 71 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాలేజీ ఎన్నో వేల మందికి విద్యనందించిందని, నేడు ఈ కాలేజీనీ యాజమాన్యం ప్రయివేటీకరణ చేయాలని చూస్తోందని తెలిపారు. దాతల సహకారంతో సుమారు రూ.2500 కోట్ల ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలు ప్రయివేటుపరం అయితే ఆయా ఆస్తులు కొందరు వ్యక్తుల సొంతమవుతాయని తెలిపారు. యాజమాన్యానికి ఎయిడెడ్‌లో నడపడం చేతకాకపోతే ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు మాట్లాడుతూ భీమవరం అంటే ప్రజలకు గుర్తొచ్చేది డిఎన్ఆర్ కాలేజీ అని తెలిపారు. ఆ కాలేజీని కాపాడుకోవడం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈ పోరాటానికి భీమవరం ప్రజలు, మేధావులు, పూర్వ విద్యార్థులు మద్దతు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు టి.ప్రసాద్, పట్టణ నాయకులు పి.శ్రీకాంత్, జి.శ్రీనివాస్, ఎస్.శాంతి, షైక్.సాయిలాల్, ఎస్.లక్ష్మణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్



ఎఎంసి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రసూల్‌బి

ఎఎంసి ఛైర్మన్‌గా షేక్ రసూల్‌బి

ప్రజాశక్తి - ఆకివీడు

ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఆకివీడు ఎఎంసి ఛైర్మన్ పదవి ఎట్టకేలకు షేక్ రసూల్‌బిని వరించింది. బుధవారం సాయంత్రం రసూల్‌బితో సహా ఇతర సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అట్టహాసం లేదు ఆర్భాటం లేదు. ప్రశాంతంగా ఐదు నిమిషాల్లో మొత్తం కార్యక్రమం ముగిసింది. ఆమెకు గతంలోనే ఒకసారి ప్రతిపాదనలు వచ్చినప్పటికీ పేరు మార్పు చేయడంతో మరోసారి ఆ పరిస్థితి రాకుండా ఈ రకంగా చేసి ఉంటారని అందరూ భావిస్తున్నారు. కాళ్ల మండలానికి చెందిన గంటా ఆనందరావు ఉపాధ్యక్షుడిగా, మరో 15 మంది సభ్యులతో కొత్త కార్యవర్గం ఏర్పడింది. వీరికితోడు మరో ఇద్దరు అధికారులు ఇందులో అదనపు సభ్యులుగా ఉంటారు. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

ధరలు అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం

30 నుంచి దశలవారీ ఆందోళనలకు పిలుపు - సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

ధరలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, ఇప్పటికైనా ధరలను అరికట్టాలని లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ప్రభుత్వాలను హెచ్చరించారు. బుధవారం సిపిఎం పట్టణ కమిటీ, ముఖ్యుల సమావేశం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు అధ్యక్షతన సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. వీటితోపాటు విద్యుత్ సంస్కరణల ద్వారా కరెంట్ ఛార్జీలు పెంచారని విమర్శించారు. పెద్దపెద్ద కార్పొరేట్ శక్తులకు రుణాలు మాఫీ చేస్తూ పేద, మధ్యతరగతి ప్రజలపై జిఎస్‌టి పేరుతో లక్షల కోట్ల రూపాయలు భారాలు వేస్తున్నారని విమర్శించారు. ఉపాధి లేక పెరిగిన ధరలు తట్టుకోలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఉపాధి చూపించి అధిక ధరలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30వ తేదీ నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకూ అధిక ధరలు, నిరుద్యోగంపై దశల వారీ ఆందోళనకు సిపిఎం పిలుపునిచ్చిందని తెలిపారు. సచివాలయం, తహశీల్దార్ కార్యాలయాల ఎదుట జరిగే ధర్నాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలపాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, నాయకులు డి.నాగేశ్వరరావు, కె.కృష్ణ, చైతన్ ప్రసాద్, బి.త్రిమూర్తులు, బంగారు వరలక్ష్మి, నీలాపు అప్పన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బలరాం

నల్లధనం వెనక్కి తేవడంలో మోడీ విఫలం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - ఉండి

అధికారం చేపట్టగానే విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి తీసుకొచ్చి భారత ప్రజల అకౌంట్లలో డబ్బులు వేస్తానని హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ ఆ హామీ అమలులో ఘోరంగా విఫలమయ్యారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. సిపిఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు నిర్వహించే దశలవారీ ఆందోళనలను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు బుధవారం ఉండి మెయిన్ సెంటర్లో ప్రజాసంఘాల కార్యాలయంలో మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో గోపాలన్ మాట్లాడారు. మోడీ అధికారం చేపట్టిన తర్వాత నిత్యావసర సరుకుల ధరలు రెండింతలు పెరిగిపోయాయని, గ్యాస్ సిలిండర్ ధర మూడింతలు పెరిగిందని, ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై పన్నుల భారాలు మోపి వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలిపారు. పెంచిన ధరలు తగ్గించి సామాన్య ప్రజలకు ఉపశమనాన్ని కలిగించాలని, లేనిపక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి మాధవరావు, రామకృష్ణ వెంకటరత్నం, బొర్రా త్రిమూర్తులు, చీరల శ్రీనివాస్, కింతాడ రమేష్, పేటూరి సుబ్రహ్మణ్యం, మునకాల రాజు పాల్గొన్నారు.

సత్యవతి మృతి బాధాకరం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట స్కెక్ స్కూల్ వ్యవస్థాపకులు, రిటైర్డ్ సైంటిస్ట్, కో-ఆపరేటివ్ సొసైటీ మాజీ ఉపాధ్యక్షులు, సిపిఎం సానుభూతిపరులు దగ్గర సుబ్బారావు భార్య సత్యవతి మృతి బాధాకరమని పలువురు అన్నారు. ఆమె అంత్యక్రియలు బుధవారం ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో జరిగాయి. ఈ అంత్యక్రియలకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్, సిపిఎం మండల కమిటీ సభ్యులు వడ్డి మోహన్‌రావు, చేతి వృత్తుల జిల్లా నాయకులు వర్ధినీడి శ్రీనివాస్, స్కెక్ స్కూల్ మాజీ ప్రిన్సిపల్ నక్క ప్రేమ్‌కుమార్, సిఎస్ఎస్ డిగ్రీ కళాశాల లెక్చరర్ వైట్ల క్రిష్ణ, కొట్టి ప్రకాష్ పాల్గొన్నారు. సత్యవతి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.


ఎంఎల్ఎ గ్రంధితో ప్రభుత్వ ఎక్సైజ్ శాఖ డిపో మేనేజర్ రంగారెడ్డి

ఎంఎల్ఎ గ్రంధిని కలిసిన రంగారెడ్డి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రభుత్వ ఎక్సైజ్ శాఖ డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎల్.రంగారెడ్డి ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డిని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అభినందించారు.

మళ్లీ జగనే సిఎం : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్మోహన్‌రెడ్డి అధికారం లోకి రావడం ఖాయమని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు జరుగుతున్న సంక్షేమాన్ని, అభివృద్ధిని అడ్డుకోవాలనే తలంపుతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు అనేక కుట్రలు పన్నుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో 175కు 175 సీట్లు కచ్చితంగా గెలుచుకుంటామన్నారు. 2014 ఎన్నికల్లో జనసేన, ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకుని ప్రజలకు 600కి పైగానే హామీలను ఇచ్చి అధికారంలోకొచ్చిన చంద్రబాబు అన్ని వర్గాలను కూడా మోసం చేశారన్నారు. అందుకే 2019 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కేవలం 23 సీట్లకే చంద్రబాబును పరిమితం చేశారన్నారు. ఒకపక్క అభివృద్ధి, మరోపక్క సంక్షేమంతో సిఎం జగన్ పాలన చేస్తున్నారన్నారు. వైసిపిలో కొంతమంది చురుకుగా పని చేస్తుంటే మరికొంతమంది నిర్లిప్తతతగా ఉన్నారన్నారు. నిర్లిప్తత వదిలి ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. సచివాలయ పరిధిలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయనరసింహరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, సేవాదళ్ కన్వీనర్ చిన్నమిల్లి వెంకటరాయుడు, భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఎవిఆర్.సభాపతి, జెసిఎస్ కన్వీనర్లు మానుకొండ ప్రదీప్, చెల్లబోయిన సూర్యప్రకాష్, గాదిరాజు సుబ్రహ్మణ్యంరాజు, కోమటి రాంబాబు, కామన నాగేశ్వరరావు, గూడూరి ఉమబాల, గూడూరి ఓంకార్, గొలగాని సత్యనారాయణ, తోట భోగయ్య, వేండ్ర విజయదుర్గ, అల్లూరి నాగవల్లి, కానుబోయిన వెంకటరమణ, కందికట్ల ఎడ్వర్డ్, కొప్పర్తి సత్యనారాయణ, రేవూరి గోగురాజు, ఎఎస్.రాజు, కోళ్ల బాలకృష్ణ, ఎర్రంశెట్టి శ్రీనివాస్, కడలి ధర్మారావు, చికిలే మంగతాయారు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో గుడాల గోపి పర్యటన

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి ఈ నెల 23వ తేదీ గురువారం మండలంలోని వద్దిపర్రు, రావిపాడు, పెనుమదం, మట్టపర్రు గ్రామాల్లో పర్యటిస్తారు. అనంతరం పాలకొల్లులోని కార్యాలయంలో ఉంటారు.

నేరాలు - ఘోరాలు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రమేష్

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వీరవాసరం

బావమరిది పెళ్లి నిమిత్తం బంధువులకు శుభలేఖలు పంచేందుకు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో అతడు మృతి చెందాడు. ఈ ఘటన వీరవాసరం వద్ద జాతీయ రహదారి 165పై బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకోడేరు మండలం విస్సాకోడేరుకు చెందిన మరివాడ తారకరామారావు (43) పెన్నాడ వద్ద వంకాయలపాలెం రైల్వే గేటుమాన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో తన బావమరిది పెళ్లి నిమిత్తం బంధువులకు శుభలేఖలు పంచేందుకు బుధవారం బైక్‌పై రావులపాలెం, యానాం బయలుదేరాడు. వీరవాసరం తూర్పు చెరువు సెంటర్ సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తారకరామారావు లారీ చక్రాల కింద పడడంతో తలకు తీవ్ర గాయామై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సిఐ నాగప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం తరలించారు.

తెలుగువారి తెగువకు నిలువెత్తు నిదర్శనం టంగుటూరి

విగ్రహ ఏర్పాటుకు రూ.50 వేలు అందిస్తా

జయంతి వేడుకల్లో ఆర్‌డిఒ దాసిరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తెలుగువారి తెగువకు నిలువెత్తు నిదర్శనం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. భీమవరం ప్రకాశం చౌక్‌లో ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని జయంతోత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసిరాజు మాట్లాడుతూ భీమవరంలో ఏర్పాటుచేసే టంగుటూరి విగ్రహానికి తన వంతుగా రూ.50 వేలు అందిస్తానని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దశాబ్దాలుగా ఈ ప్రకాశం చౌక్‌లో ఆయన విగ్రహం నెలకొల్పాలని ప్రయత్నాలు చేస్తున్నామని, ఎంతోమంది దాతలు సహకరించారు, నేడు ఆర్‌డిఒ రూ.50 వేలు ఇస్తామని ప్రకటించడంతో తప్పక విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మూడురోజులుగా నిర్వహిస్తున్న పోటీల్లో గెలుపొందిన 36 మందికి ప్రశంసాపత్రాలు, షీల్డులు అందించారు. ముందుగా క్విట్ ఇండియా స్థూపం నుంచి ప్రకాశం చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయంతి ఉత్సవ సభ్యులు కంతేటి వెంకటరాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, భట్టిప్రోలు శ్రీనివాస్, న్యాయవాది ఉండవల్లి రమేష్‌నాయుడు, ఇండుకూరి ప్రసాద్ రాజు, లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్ నందమూరి రాజేష్, ఉపాధ్యాయులు నరహరిశెట్టి కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.


పాలకొల్లులో టంగుటూరి జయంతి వేడుకలు

పాలకొల్లు : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా బుధవారం పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్‌లో జాతీయ నాయకులకు నివాళి అర్పించారు. పాలకొల్లు శ్రీ క్షీరారామ బ్రాహ్మణ సేవా సంఘం వారి ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఆంధ్రకేసరికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోమంచి శ్రీనివాస్ శాస్త్రి మాట్లాడుతూ టంగుటూరి సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధుడు, రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి అని చెప్పారు. నేటి కాలంలో ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చెరువూరి నరసింహమూర్తి, కార్యదర్శి నందుల దశరథ్, ట్రెజరర్ వెంకటేశ్వరరావు, సంఘం గౌరవ వ్యవస్థాపక అధ్యక్షులు సోమంచి శ్రీనివాస్‌శాస్త్రి, హరినారాయణ, నందూరి జానకిరామయ్య, యర్రమిల్లి నరసింహారావు, రమణకుమార్, శ్రీనివాస్, దేవరకొండ రామాంజనేయులు, తాతపూడి శర్మ, చాగంటి ప్రసాద్, నిడమర్తి బాలాజీ, రాయవరపు సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

పెనుమంట్ర : మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో టంగుటూరి ప్రకాశంపంతులు చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎడిఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి మాట్లాడుతూ టంగుటూరి జీవితం విద్యార్థులకు ఆదర్శప్రాయమన్నారు. ఆయన జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. వ్యవసాయ పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రామభద్రరాజు మాట్లాడుతూ మహనీయుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ బోధన, బోధనేతర సిబ్బంది, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

సమాజ సేవకుడు నిరీక్షణరాజుకు డాక్టరేట్

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కోపల్లె గ్రామానికి చెందిన సమాజ సేవకుడు, అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.నిరీక్షణరాజుకు గోవా రాష్ట్రంలోని సన్‌రైజ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అవార్డును ఈ నెల 21న సోమవారం అందుకున్నారు. తన సంపాదనలో కొంతైనా సామాజిక, ఆధ్యాత్మిక సేవకు హెచ్చించాలనే దృక్పథంతో ఆక్వా కార్మికులకు పేదలకు తన వంతు సాయం చేస్తున్నారు. ఆయన చేసిన సేవలను గుర్తించి గోవాలోని సన్‌రైజ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డును ప్రదానం చేసింది. నిరీక్షణరాజు స్వతహాగా మృదు స్వభావి. ఆయన ఆక్వా రంగంలో లేబర్ కాంట్రాక్టర్‌గా స్థిరపడి, కష్టాల్లో ఉన్నవారికి చేయూత అందిస్తూ, గత 15 ఏళ్లుగా ఆక్వా రంగంలో రాణిస్తున్నారు. కోపల్లె గ్రామంలో అంబేద్కర్ అభ్యుదయ భావాలు ఉండడంతో గ్రామంలో అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిఏటా అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తూ తన వంతు సహకారం అందిస్తున్నారు. నిరు పేదలకు ఆర్థిక సహాయం చేస్తున్నారు. నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీలు 2022లో ఘనంగా నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ప్రతిఏటా క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఆక్వా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కరోనా మొదటి, రెండు దశల్లో వందలాది మంది కార్మికులకు రూ.లక్షల విలువైన కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించారు. కరోనా, లాక్ డౌన్ కారణంగా ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న వందలాది మంది ఆక్వా కార్మిక కుటుంబాలకు, పలు గ్రామాల్లో పేదలకు ఆర్థిక సహకారం అందించారు. డి.నిరీక్షణ రాజు చేస్తున్న సేవలను గుర్తించి గోవాలోని సన్ రైజ్ యూనివర్సిటీ డాక్టరేట్ అవార్డును ప్రదానం చేసింది. డాక్టరేట్ అందుకోవడం పట్ల కోపల్లె గ్రామస్తులు, ఆక్వా కార్మికులు నిరీక్షణరాజును అభినందిస్తున్నారు.


డాక్టరేట్ అవార్డును అందుకుంటున్న నిరీక్షణరాజు

గుండెపోటుతో వార్డు కౌన్సిలర్ మృతి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

వైసిపి పట్టణ సీనియర్ నాయకుడు, 16వ వార్డు కౌన్సిలర్ గొల్ల జయ రాజ్‌సింగ్ బుధవారం ఉదయం వైఎన్ కళాశాల వాకింగ్ ట్రాక్‌పై వాకింగ్ చేస్తూ గుండెపోటుతో మృతి చెందారు. గాంధీనగర్‌లో ఆయన స్వగృహం వద్ద జయరాజు సింగ్ మృతదేహాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, చైర్‌పర్సన్ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. ఆయన గతంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులో మేనేజర్‌గా విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు. అనంతరం వైసిపి తరపున 16వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికై ప్రజలకు సేవ చేశారు. మంగళవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి కూడా హాజరయ్యారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది జయరాజ్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


జయరాజ్‌సింగ్ (ఫైల్‌ఫొటో)

మహిళలు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సమాజంలో ప్రముఖ స్థానం వహిస్తున్న మహిళల్లో ఎక్కువగా పౌష్టికాహార లోపాలు, రక్తహీనత కనిపిస్తున్నాయని, వాటిని అధిగమించేందుకు మహిళలు ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రముఖ వైద్యురాలు, పాథాలజిస్ట్, లోటస్ డయాగ్నోస్టిక్ వైద్య నిపుణురాలు బిహెచ్.శ్వేత చెప్పారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మహిళా అధ్యాపకులకు, విద్యార్థినులకు, హెల్త్ స్క్రీనింగ్ ఫర్ ఉమెన్ ఎ కంప్లీట్ బ్లడ్ ప్రొఫైల్ టెస్ట్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.భువనేశ్వర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్వేత మాట్లాడుతూ కుటుంబ నిర్వహణలో పూర్తి బాధ్యత వహిస్తున్న మహిళలు తమ ఆరోగ్యం విషయంలో మాత్రం శ్రద్ధ తీసుకోలేకపోతున్నారన్నారు. తమ పరిశీలనలో 95 శాతం మంది మహిళల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపాలు గమనించినట్లు చెప్పారు. దీనిని అధిగమించేందుకు గైనకాలజిస్ట్, పాథాలజిస్ట్ వైద్య నిపుణుల సూచనలు, సలహాలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఇన్‌ఛార్జి డాక్టర్ బిహెచ్‌విఎన్.లక్ష్మి మాట్లాడుతూ ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో చేపట్టే పలు కార్యక్రమాలకు మహిళా వైద్యులు వచ్చి తమ సూచనలు, సలహాలు అందించడం మహిళా ప్రగతికి ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఎస్.లవకుమార్, జి.శశికళ, జి.శ్రీబాల, బిహెచ్.రేవతి, జి.శ్రీసత్య పాల్గొన్నారు.

సంధ్యారాణి కుటుంబానికి న్యాయం చేయాలి

త్వరలో పరామర్శకు రానున్న లోకేష్

తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - ఆకివీడు

ఇటీవల దారుణ హత్యకు గురైన సంధ్యారాణి బిడ్డకు, ఆమె తల్లిదండ్రులకు ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ సిరిగిరి రాజ్యలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం ఆమె హత్యకు గురైన సంధ్యారాణి తల్లిదండ్రులను, బిడ్డను పరామర్శించారు. అనంతరం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పోలీసులు నిందితుల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. తల్లిదండ్రులకు నిందితుడి వల్ల హాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. సంధ్యారాణి కుమారుడి భవిష్యత్తుకు గ్యారెంటీ ఇవ్వాలని ఆమె కోరారు. సంధ్యారాణి తల్లిదండ్రులను, బిడ్డను పరామర్శించేందుకు త్వరలో తమ పార్టీ నాయకుడు నారా లోకేష్ రానున్నట్లు ఆమె తెలిపారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు, మండల తెలుగు మహిళ సరళ, కౌన్సిలర్ బొల్లం వీర శ్వేత, పార్టీ పట్టణ అధ్యక్షులు బల్ల వెంకట్రావు ఉన్నారు.

దళితులపై దాడులు దారుణం

పివి.రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు సూర్యవరప్రసాద్‌రావు

ప్రజాశక్తి - భీమవరం


స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు అవుతున్నా దళితులపై నేటికీ దాడులు జరగడం దారుణమని పివి.రావు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మాపు వరప్రసాద్‌రావు అన్నారు. ఉండి మండలంలోని వాండ్రంలో దళితులపై దాడి ఘటనను ఖండిస్తూ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యవరప్రసాద్‌రావు మాట్లాడుతూ ఆధిపత్య సామాజిక తరగతులకు చెందిన గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో సుమారు 400 మంది కత్తులు, కర్రలతో దళితపేటలోకి దౌర్జన్యంగా చొరబడి దళితులపైన దాడి చేయడమే చర్చిని ధ్వంసం చేయడం దారుణమన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నపటికీ దళితులపైన దాడులు, దళిత మహిళలపైన హత్యలు, అత్యాచారాలు, కుల వివక్షత దేశవ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయన్నారు. రాజకీయపార్టీ నాయకులు దళితులను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారన్నారు. దళితపేటపై దాడి చేసిన వారిని పోలీసులు ఇప్పటివరకు అరెస్ట్ చేయకుండా ఆధిపత్య సామాజిక తరగతులవారికి కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ఎస్‌సి ఎస్‌టి మోనటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ మాట్లాడుతూ ఎవరైతే దళితులపై అమానుషంగా దాడికి పూనుకున్నారో వారిపై ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ, హత్యాయత్నం కింద కేసులు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేయాలని, బాధితులకు, దళితులకు రావాల్సిన రాయితీలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26వ తేదీ లోపు నిందితులను అరెస్ట్ చేయకపోతే అన్ని దళిత, ప్రజా సంఘాలతో కలిసి పెద్దఎత్తున ఉద్యమించి మరో గరగపర్రు ఉద్యమానికి నాంది పలుకుతామని హెచ్చరించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ బోర్డు మెంబర్ పెదపాటి పెద్దిరాజు, సీనియర్ దళిత నాయకుడు కోరం మునలయ్య, రాష్ట్ర కార్యదర్శులు కొత్రపాటి వీరాస్వామి, గోడి పెద్దిరాజు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు సూర్యవరప్రసాద్‌రావు

దళిత సంఘాలను అడ్డుకోవడం దారుణం

ఉండి : దళితులపై దాడి చేసి వారిపైనే కేసులు మోపిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. చలో వాండ్రం కార్యక్రమం పిలుపులో భాగంగా వాండ్రం వెళ్తున్న దళిత సంఘాలను కోపల్లె హైస్కూల్ వద్ద ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు తన సిబ్బందితో అడ్డుకున్నారు. నన్నేటి పుష్పరాజ్‌తో పోలీసులు వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు డిఎస్‌పి బండారు శ్రీనాథ్‌కు సమాచారం అందించగా శ్రీనాథ్ పుష్పరాజ్‌తో ఫోన్‌లో మాట్లాడి దళితులకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాలు రెండు రోజుల్లో వస్తాయని, అవి రాగానే నిందితులను అరెస్టు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో నన్నేటి పుష్పరాజ్ చలో వాండ్రం కార్యక్రమాన్ని రెండు రోజులు వాయిదా వేస్తున్నామని, న్యాయం జరగకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సువర్ణరాజు, పాస్టర్ నేతల జ్ఞానప్రకాష్, ఉండి నియోజకవర్గ అధ్యక్షులు చిగురుపాటి రాజేష్, ఉండి మండల అధ్యక్షులు తోర్లపాటి భాగ్యరాజ్, భీమవరం నియోజవర్గ అధ్యక్షులు పిట్టా వినోద్ కుమార్, భీమవరం నియోజవర్గ వర్కింగ్ కమిటీ అధ్యక్షులు సాల్మన్‌రాజు, భీమవరం మండల అధ్యక్షులు దాసరి చిరంజీవి, భీమవరం పట్టణ అధ్యక్షుడు గొర్ల గోపి, కోరం రాహుల్, రవి పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు.. ప్రజల అవస్థలు


ఆకివీడులో అధ్వానంగా ఉన్న రైల్వే స్టేషన్‌కి వెళ్లే రోడ్డు


పెనుగొండలో గోతులమయంగా ఉన్న ఓవర్ బ్రిడ్జి రోడ్డు

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు జాతీయ రహదారి నుంచి రైల్వే స్టేషన్‌కి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. దొరగారి చెరువు గట్టు నుంచి రైల్వే స్టేషన్‌కి వెళ్లే దారి మొత్తం బురదమయంగా ఉంది. వర్షం కురిస్తే అక్కడ పరిస్థితి దారుణంగా మారడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. జాతీయ రహదారి నుంచి సుమారు 12 కొల్లేటి గ్రామాలకు ఇది ప్రధాన మార్గం. రైస్ మిల్లులు, ఐస్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఇంత ట్రాఫిక్ ఉన్నా ఈ రోడ్డును ఎవరూ పట్టించుకోవడంలేదు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

పెనుగొండ : పెనుగొండలో ఓవర్ బ్రిడ్జి వద్ద రోడ్డు గోతులమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ వంతెనపై కాలేజీ, పాఠశాల విద్యార్థులు ప్రయాణిస్తుంటారు. తణుకు వైపు వెళ్లే వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రోడ్డంతా గోతులమయంగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.

ఘనంగా తెలుగు భాష వారోత్సవాలు

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాష వారోత్సవాల నిర్వహణ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు విద్యార్థులకు తెలుగు పద్యాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుజాత ప్రారంభించారు. పోటీల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు కె.గాయత్రి, లావణ్యలు ప్రథమ స్థానం సాధించారు. మొదటి సంవత్సరం బిఎస్‌సి విద్యార్థిని మీనాక్షి దీపిక ద్వితీయ స్థానం సాధించింది. ఈ కార్యక్రమాన్ని తెలుగు అధ్యాపకులు తంగి భోగేశ్వరరావు నిర్వహించారు.

అల్లాడి ఆంజనేయులుకు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

కాపు సంక్షేమ సేన జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన అల్లాడి ఆంజనేయులును కాళ్లలో బుధవారం సత్కరించారు. ఆంజనేయులును కాపు సంక్షేమ సేన ఉండి నియోజకవర్గ యువత అధ్యక్షులు చవ్వాకుల నాని, ఉపాధ్యక్షులు పసుపు లేటి వెంకటరవణ సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా అల్లాడి ఆంజనే యులు మాట్లాడుతూ కాపు సంక్షేమ సేన జిల్లా ఉపాధ్యక్షుడిగా తనను నియమిం చినందుకు ఆ సేన వ్యవస్థాపకులు హరిరామ జోగయ్యకు, ఉపాధ్యక్షులు మలినీడి బాబికి కృతజ్ఞతలు తెలిపారు. జనసేన పార్టీకి కాపు సంక్షేమ సేన మద్దతు ఎప్పుడు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన ఉండి నియోజకవర్గ నాయకులు నాని, బండారు సోమేశ్వరరావు, జెట్టిబోయిన పోతురాజు, చెన్నూరి భరత్ కుమార్, మదాసు సత్యనారాయణ, బండారు పుండరీకాక్షుడు, కిషోర్ పాల్గొన్నారు.


పెనుమంట్రలో...

'టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి'

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి అధికారంలోకి రావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి (బుల్లాలు) అన్నారు. మండలంలోని వెలగలేరులో బుధవారం మహిళాశక్తి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో మండల కార్యదర్శి మురళి, మార్టేరు మాజీ పిహెచ్‌సి ఛైర్మన్ కర్రి అచ్యుత రామారెడ్డి, మాజీ ఎంపిపి టాలీ, ఏడుకొండలు, కారిపెల్లి భాస్కరరావు పాల్గొన్నారు.

పోడూరు : మండలంలోని పోడూరులో నిర్వహించిన మహాశక్తి కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు పాల్గొన్నారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి మహానాడులో ప్రకటించిన మినీ మేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రవిరాజు, రమేష్‌రాజు, పార్టీ మండల కార్యదర్శి బొక్క సూర్యనారాయణ, సుబ్రహ్మణ్యంరాజు, జయరామకృష్ణ, గ్రామ అధ్యక్షుడు దొమ్మేటి పురుషోత్తం పాల్గొన్నారు.

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు జుడిషియల్ ఫస్టు క్లాసు మేజిస్ట్రేట్ వారి కోర్టులో

ఐ.ఎ. నం. 832/2022 ఇన్ ఒ.యస్. నం. 69/2014

బిట్వీన్:
పెచ్చెట్టి నరసింహమూర్తి మరియు అనదర్
-పిటీషనర్స్/ వాదులు
మరియు
1. పెచ్చెట్టి వెంకట సత్యనారాయణ (డైడ్)
2. పెచ్చెట్టి శ్రీరామమూర్తి (డైడ్)
-రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

ప్రపోజుడు పార్టీలు:
3. పెచ్చెట్టి చంద్రకళ, భర్త: దొమ్మేటి నాగేశ్వరరావు, చుట్టుగుంట, విజయవాడ, 4. గంగా కళాజ్యోతి, భర్త: వినయ్, తండ్రి: పెచ్చెట్టి వెంకట సత్యనారాయణ, చుట్టుగుంట, విజయవాడ. 5. పెచ్చెట్టి శ్రీనివాస్‌కుమార్, తండ్రి: వెంకట సత్యనారాయణ, మాచవరం డౌన్, చుట్టుగుంట, విజయవాడ. 6. పెచ్చెట్టి శ్రీ లక్ష్మి, తండ్రి: వెంకట సత్యనారాయణ, చుట్టుగుంట, విజయవాడ. 7. దొంగ మీనాక్షి, భర్త: శ్రీనివాసరావు, హౌసింగ్ బోర్డు కాలనీ, పాలకొల్లు.

పై నం. దావాలో ప్రతివాదులు 1, 2 లు చనిపోయినందున వారి వారసులైన 3 నుండి 7 వరకు రెస్పాండెంట్లు అయిన మిమ్ములను ఈ పిటీషన్‌లో చేర్చు నిమిత్తం మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినప్పటికి తీసుకోకుండా కాలయాపన చేసినందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయటమైనది. కాబట్టి దీ. **1-9-2023 ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు వ్యక్తిగతంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని మీ వాదన తెలియజేయవలసినదిగా కోరుచున్నాము. లేనిచో పై పిటీషన్ మీ పరోక్షముగా తీర్మానించబడును.

డి.సుబ్రహ్మణ్యం
పాలకొల్లు — అడ్వకేట్, పాలకొల్లు
23-8-2023 — సెల్: 98491 73674

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు జుడిషియల్ ఫస్టు క్లాసు మేజిస్ట్రేట్ వారి కోర్టులో

ఐ.ఎ. నం. 835/2022 ఇన్ ఐ.ఎ. నం. 438/2014 ఇన్ ఒ.యస్. నం. 69/2014

బిట్వీన్:
పెచ్చెట్టి నరసింహమూర్తి మరియు అనదర్
-పిటీషనర్స్/ పిటిషనర్లు
మరియు
1. పెచ్చెట్టి వెంకట సత్యనారాయణ (డైడ్)
2. పెచ్చెట్టి శ్రీరామమూర్తి (డైడ్)
-రెస్పాండెంట్లు/ రెస్పాండెంట్లు

ప్రపోజుడు పార్టీలు:
3. పెచ్చెట్టి చంద్రకళ, భర్త: దొమ్మేటి నాగేశ్వరరావు, చుట్టుగుంట, విజయవాడ, 4. గంగా కళాజ్యోతి, భర్త: వినయ్, తండ్రి: పెచ్చెట్టి వెంకట సత్యనారాయణ, చుట్టుగుంట, విజయవాడ. 5. పెచ్చెట్టి శ్రీనివాస్‌కుమార్, తండ్రి: వెంకట సత్యనారాయణ, మాచవరం డౌన్, చుట్టుగుంట, విజయవాడ. 6. పెచ్చెట్టి శ్రీ లక్ష్మి, తండ్రి: వెంకట సత్యనారాయణ, చుట్టుగుంట, విజయవాడ. 7. దొంగ మీనాక్షి, భర్త: శ్రీనివాసరావు, హౌసింగ్ బోర్డు కాలనీ, పాలకొల్లు.

పై నం. పిటీషన్లో రెస్పాండెంట్లు నం.లు 1, 2 చనిపోయినందున వారి వారసులైన 3 నుండి 7 వరకు రెస్పాండెంట్లు అయిన మిమ్ములను ఈ దావాలో చేర్చు నిమిత్తం మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినప్పటికి తీసుకోకుండా కాలయాపన చేసినందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయటమైనది. కాబట్టి దీ. **1-9-2023 ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు వ్యక్తిగతంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని మీ వాదన తెలియజేయవలసినదిగా కోరుచున్నాము. లేనిచో పై పిటీషన్ మీ పరోక్షముగా తీర్మానించబడును.

డి.సుబ్రహ్మణ్యం
పాలకొల్లు — అడ్వకేట్, పాలకొల్లు
23-8-2023 — సెల్: 98491 73674